

# గ్రంథాలయం

యేమేమి వ్యాపారాలు పెట్టచ్చు? దేనికి పెట్టుబడి తక్కువ? దేనిని నడపటం సులభం? శ్రమ దేనికి తక్కువ? అని ఆలోచిస్తున్నది, బిందు. పరిశ్రమలకు లక్షలు చాలవు. కోట్లలోకి పోతుంది వ్యవహారం. ఒకాయన లోతు తెలుసుకోకుండా కార్ల పరిశ్రమలోకి దిగి దానిలోతు కోట్లలో వున్నదని తెలుసుకునేనాటికి వ్యవహారం శృతి మించింది. కుటీర పరిశ్రమల ఆలోచన వచ్చింది బిందుకి. వూరగాయలు, అప్పడాలు వడియాలు పెట్టగలిగినా వాటిని ఆకర్షవంతంగా ప్యాక్ చేసి పచారీ అంగళ్లల్లో యిచ్చి డబ్బు తెచ్చే నమ్మకమైన సమర్థురాలైన మనిషి అందాలి. తానే ఆ పని చేయలేదు. సాహిత్యరంగంలోకి దిగి పోటీలు నడిపి లాభం చూడటానికి లోకజ్ఞానం, తెలివికావాలి. పుస్తకప్రచురణకి అద్దె యిల్లు, ముద్రణా యంత్రం, పనివారు, కమీషన్ తెచ్చేవారు అదొకహంగామా. తానే ప్రూఫ్ రీడింగ్ చేయాలి. అమ్మకమూ చేతకావాలి. అది హిమాలయాలెక్కటమే. బిందుకి చివరికి గుర్తువచ్చినది గ్రంథాలయం. అది నష్టం తేదని చూసింది.

తెలుగు గ్రంథాలయం, స్త్రీలకు, పిల్లలకూ మాత్రమే అని బల్ల వ్రాయించి కట్టించింది. రంగులేయించి, షెల్ఫులూ, రాకులు బల్లలు కుర్చీ లు మోడరన్ ఫర్నిచర్. గోడ గడియారం. ఒక బల్ల మీద, సభ్యత్వ రుసుము, పనిచేయు వేళలు అని వ్రాయించి వేలాడదీసింది. దీపాలు, పంకాలు చిన్న వాష్ రూమ్. చిన్న కాంటీన్ అనుబంధంగా వుంచింది. మంచి పనివారే అందారు దైవ కృపవల్ల.

దిన, వార, మాస, త్రైమాసిక పత్రికిలు బల్లమీదుంటాయి.

ఆకర్షణ కోసం పిల్లలకు వుయ్యాల, వేలాడదీసిన పేము వుయ్యాల,

నేలమీద వుంచిన వుయ్యాల పసివారికోసం. రెండు తెల్లని బొచ్చు కుక్కపిల్లలు, రెండు పిల్లి పిల్లలూ, పంజరంలో చిలక, మైనా.

గ్రంథాలయం బాగా నడుస్తుండగా, ఒక ఆయానూ పెట్టింది బిందు. ఆయా పిల్లలనాడిస్తుంది. పాలు పడ్తుంది. దుస్తులు మారుస్తుంది.

ఇలా గ్రంథాలయం మూడుపువ్వులూ, ఆరుకాయలు లాగా నడుస్తున్నది. ఆనాడు బిందు సుఖాసీనురాలై తాజా వార్తలు చదువుతున్నది. టైము సాయంత్రం అయిదు గంటలు.

ఒక కొత్త వ్యక్తి లోపలికొచ్చి ''నమస్తే'' అని నిలబడింది.

బిందు పత్రిక తొలగించి చూసింది. ''స్వాగతం. ఆ కుర్చీలో కూచోండి. సభ్యులౌతారా? యెప్పుడన్నా వచ్చి దినపత్రిక చదివి వెళ్తారా?'' బిజినెస్ మొహం పెట్టి అడిగింది.

వచ్చినామె థాంక్సు చెప్పి ఆసీనురాలైంది'' సభ్యురాలినౌతాను. పేరు విదిశా. ప్రైవేటు కంపెనీలో స్టెనోని. వర్కింగ్ వుమన్‌కోసం కట్టించిన వన్ బెడ్‌రూమ్ అపార్ట్‌మెంటులో వుంటున్నాను''.

''పుస్తకాలు చదవటం అలవాటు చేసుకోండి'' అని మీరిచ్చిన ఎడ్వర్‌టైజుమెంట్ దూరదర్శినిమీద చూసి వచ్చాను. నాకు పుస్తకాలే బంధువులు, స్నేహితులు. ఒక కవి అలానే పోల్చి కవిత అల్లాడు. పరిచితులతో మాట్లాడుతున్నట్టే వుంటుంది నాకు పుస్తకం చదువుతుంటే'' అన్నది విదిశా. 'పుస్తకాల లిస్టున్న బుక్ యిస్తారా?'' అన్నది టైమ్ వేస్టు చేయకుండా.

బిందు లేచి వెళ్లి పుస్తకం తెచ్చి యిచ్చి మళ్లా తన పత్రిక అందుకుని మొహానికడ్డం పెట్టుకుని చదవసాగింది.

అట్ట తిప్పి భాగాలుగా వున్న లిస్టు చదవసాగింది విదిశా. ఆధ్యాత్మికము, చారిత్రకము, పౌరాణికము, సాంఘికము, నేరపరిశోధన, సైన్సుకు సంబంధించిన రచనలు, వ్రతకథలు, పిట్టకథలు, బాలసాహిత్యం, నవలలూ, నాటికలూ, జాతకమార్తాండం, బృహజ్జాతకం, శతకమంజరి, ఖగోళం, భూమి పుట్టుక, సామెతలు, పుట్టుమచ్చలు, మంగళారతులు, జానపద గేయాలూ, భావకవిత్వం, అనుకరణలూ, అనుసరణలూ, అలంకరణ, పరిమళ ద్రవ్యాలు చేయుట, కుట్టు, అల్లిక, పూలుతో అల్లిక, వంటలూ పిండివంటలు, రుచీ, అభిరుచీ, పెయింటింగ్ చీరల మీద చేయట, కాగితముతో పువ్వులు యితరమైనవీ చేయుట. బిందియా, కాటుక చేయుట. అలా చూస్తూ వెళ్ళి నవలికలు, కథలసంపుటీ, సవతి తల్లి, కామక్రోధుడు, తపంచానర్చితే, మూర్ఖుని తపమేల, పెరటి చెట్టు, బందాభాయి, డడ్, హిస్టీరియా, ఆత్మీయులు, మాటా మర్యాదా, పిపాస, దాహం, ఆకలి, అమృతం, విషం, రకరకాల అమ్మలు అనే పేరు దగ్గర ఆగిపోయింది విదిశా. ''రకరకాల అమ్మలు'' అనే పుస్తకం కావాలి మేడమ్'' అని లేచింది.

సభ్యత్వ తతంగం పూర్తి చేసి, సభ్యురాలనడిగి పుస్తకం తెచ్చి అందించింది బిందు.

''థాంక్స్ మేడమ్. యెన్నాళ్లుంచుకోవచ్చు? పుస్తకం కొత్తదా? అట్టా బొమ్మా ఆకర్షవంతంగా వున్నాయి''.

''పుస్తకం మాసినా, చిరిగినా, నలిగినా కొత్తది వుంచుతాము. అలాటి

పుస్తకాన్ని అటకమీదుంచుతాము. పుస్తకం వారం వుంచుకోవచ్చు. ఇంకా అట్టిపెట్టికోవాలనుకుంటే వచ్చి సంతకం చేసి మళ్లీ పట్టుకెళ్లాలి''. అన్నది నిర్లిప్తంగా.

''అటకమీది కెక్కిన వాటినేం చేస్తారు? తెలుసుకోవచ్చునా?''

''సగం ధరకమ్మేస్తాం. సభ్యత్వ ఋసుము తక్కువ కట్టేవారికిస్తాము. లేదా ఒకామె తూక ప్రకరాం కొని అసలు ధరకో సగం ధరకో అమ్మగల సమర్థురాలున్నది. ఆమెకిచ్చేస్తాం''.

2

మాటమీద నిలబడింది విదిశా. వారానికల్లా వచ్చేసింది.

''కూచోండి. మీరు మాట నిలబెట్టుకోటం నాగరకతని తలుస్తారేమో. అదే కావాలా కొత్తది కావాలా?'' బిందు కొత్తగా వచ్చిన పుస్తకాల లిస్టు వ్రాస్తున్నది.

''థాంక్స్'' అని కూచున్నది విదిశా.

''నాటెటాల్. లిస్టు బుక్ కావాలా?''

''మరోటి కావాలి. దాని పేరు అమృతం. నేను మీ టైం వేస్టు చేస్తున్నాననుకోకపోతే ''రకరకాల అమ్మలు'' అనే పుస్తకం గురించి కొద్దిసేపు మాట్లాడాలని వున్నది''.

''అలా అనుకోను. రివ్యూ యిస్తున్నారా?'' అన్నది బిందు.

విదిశా చనువు లభించినట్లు అందంగా నవ్వి ''మీరు అష్టావధానం చేయగలరని నా అభిప్రాయం'' అన్నది.

''థాంక్స్ ధారణ స్ఫురణ వున్నాయంటున్నారు నాకు? యెలా చెప్పగలరు?'' అన్నది పని ఆపకుండానే.

ఇవాళ మొదటి తేదీ పొద్దున జీతాలందాల్సిన వారికిచ్చి పంపేస్తున్నారు. సంతకం చేశారా లేదా గమనిస్తున్నారు. నన్ను గమనించారు. నా సంగతి కనుక్కున్నారు. మాట్లాడుతూనే లిస్టు పూర్తి చేశారు. మరో సభ్యురాలొస్తే స్వాగతం పలికారు. తాజా వార్తలు వింటున్నారు. పిల్ల పుస్తకమడిగితే యెక్కడున్నదో చెప్పారు. టైం చూసుకుంటున్నారు''.

నవ్వకుండానే అన్నది బిందు ''థాంక్స్, చాల గమనించారే. యేదో చెప్తానన్నారు'' అన్నది పనిచేసుకుంటూనే.

''పాయింట్ మరువలేదు చూశారా! కాలం విలువ గమనిస్తున్నారు తెలుసా? శతావధానం చేయగలరు. వదిలేస్తున్నా. 'రకరకాల అమ్మలు' అనే కథల సంపుటిలోని కథలన్నీ చాలా సహజంగా వుండి హాస్యం ద్వారా చెప్పబడినాయి. సాధ్వీమతల్లి నుంచి, టెర్రరిస్టు అమ్మవరకు, మనుషుల్ని పుస్తకం చదివినట్టు చదివి, కల్పన జోడించి రచించారనిపించింది. అన్నిటిలోకీ టెర్రరిస్టు అమ్మ అనే కథ మా అమ్మమీద వ్రాశారేమో రచయిత అనుకున్నాను. మీకా రచయిత పరిచితులా?'' అని ఆగింది విదిశా.

''సంతోషం. పుస్తకం వెనక అట్టమీద రచయిత వివరాలుంటాయి. వారి యితర రచనలుంటాయి. గమనించలేదూ? మీకా సంపుటి మొత్తం నచ్చినందుకు

సంతోషం. సభ్యులైనందుకు మోడరన్ రచనలు చదివి రెవ్యూ వ్రాసి యివ్వండి. పబ్లిష్ చేయిద్దాము. మనుషులలో పోలికలున్నట్టు స్వభావాల్లోనూ బాగా పోలికలుంటాయి. మనుషుల్ని స్టడీ చేసిన వారే అలా వ్రాయగలరు. ఆదిశంకరులవారు మనుషుల్ని బాగా స్టడీ చేశారు గనకనే వారి కవిత్వం నేటికీ చదివి ఆనందిస్తున్నాం'' అని చెప్తూనే బిందు, సంతకం చేయించి అందుకున్న పుస్తకాన్ని మోడరన్ కథానికల సంపుటీలు అనే పుస్తకాల మధ్య అమర్చి. అమృతం అనే నవలిక తీసి తెచ్చి అందించింది. మళ్లా సంతకం చేసింది విదిశా''. ''ఆ రచయితలాగా నేను మా అమ్మను యెంజాయ్ చేయలేకపోయానండీ. హిట్లర్ మమ్మీ అని నిక్ నేమ్ పెట్టాం పిల్లలం. సరీగ్గా ఫ్యూరర్‌లాగే గుడ్లురిమి పెద్దగా అరిచేది. తాను డబ్బు మనిషిని కానని అరుస్తూనే డబ్బు డిమాండ్ చేసేది. స్వంత సనిన్లాయే నవ్వుతూ అన్నారు ''యేదో మిషపెట్టి అంతా లాగేస్తుంది మదరిన్లా''. దేశంలో అశాంతి చెలరేగితే పొరుగుదేశానికి ట్రబుల్ ఘూటరౌతాడట దేశనేత. అచ్చం అలాగే మా టెర్రరిస్టు అమ్మ యింట్లో తిరగుబాటూ, లేమీ కనబడగానే, వూళ్ల మీద బోయి, బంధుగుల యిళ్లలో దుమారం లేవదీసి వచ్చేది. వాళ్లే కలహించుకుని విడిపోతే ధర్మాత్మాలాగా ధర్మపన్నం వల్లించి, యెక్కడుండాల్సిన వాళ్లక్కడుండాలని తెచ్చి కలిపివుంచి వచ్చేది. హిట్లర్ అసలు ధ్యేయం మూడవ జర్మన్ సామ్రాజ్యం తేవాలి. యుద్ధం అందుకే మొదలెట్టాడు. కాని మధ్యలో అంటీ సెమెటిక్ వుద్యమం మొదలెట్టి దారి తప్పాడు. ఒప్పందాలు గాలిలో కెగరేశాడు. అసలు ధ్యేయం ధనార్జనే బైహుక్ ఆర్ క్రూక్ అయీ మా అమ్మ డామినేట్ చేసి, మనుషుల మీద స్వారీ చేయాలని చూసేది'' అని నవ్వుతున్నది విదిశా. కళ్ల వెంట నీళ్లు వచ్చి చెంపలమీదికి జారినై.

బిందు యీకల బ్రష్‌తో పుస్తకాలమీద దులుపుతున్నది. అటు తిరిగే అడిగింది. ''బై హుక్ ఆర్ క్రూక్ అంటే యెలా అర్థించాలనీ?''

వింటున్నది గదా లైబ్రేరియన్ అని విదిశా చెప్పింది.

''వడ్డీ వ్యాపారం, మంత్రోపదేశం, గురువు వేషం, మంత్రోదకం, పాదోదకం యిచ్చి, కర్మకాండలు చేయించీ, అంతేనా మేడమ్, లా పాయింట్లు చూసీ, అర్థించాలని ట్రై చేసింది. అవన్నీ పొసగకపోతే చికాకు పడి, యెవరికీ మంత్రతంత్రాలమీద నమ్మకం లేకుండా పోయింది అని డిప్రెస్ అయి, విభూతి పెట్టీ, ఆయుర్వేద వైద్యం చేసి మొత్తానికి పైసా కంటబడేవరకు మార్గాన్వేషణ చేసి పైసా కంటబడగానే కళ్లు మెరిసేవి టెర్రరిస్టు మమ్మీకి. అంతకంటే ఘనురాలు పెంపుడు అమ్మ. ఒక్కోసారి టెర్రరిస్టు అమ్మే నయమేమో అని అనుకునేదాన్ని. మేనమామ పెళ్లాం పేరు కామాక్షి. ఒక్కడే కొడుకు. మామయ్య ఆక్సిడెంటులో పోయాడు. ఆడపిల్ల కలగలేదు. ఆస్తికధికారి అయింది. నాలుగో యేటనించీ పన్నెండు వచ్చేవరకూ ఆమె వద్దే పెరిగాను. కొడుకు యింజనీరై ముంబాయిలో వున్నాడు. పెళ్లైంది. సంతానం కలిగింది. కామాక్షి అత్తయ్యను అమ్మా అనే పిలిచేదాన్ని. ముద్దుచేసి, గారాం చేసి, మంచి దుస్తులూ, నగలూ, మంచి తిండీ, తిండి అంటే మీగడ పెరుగు, అమృతం వంటి వెన్నా. దంపుడు బియ్యపన్నం. నూకల నెయ్యీ వేసి తినిపించేది. జీవకారుణ్య సంఘ సభ్యురాలు. కుక్క పిల్లల్నీ, పిల్లుల్నీ, నెమలీ, పంజరాల్లో చిలుక, మైనా. వాటికి మాటలు నేర్పింది. నెమలికి గజ్జెలు కట్టి ఆడించేది. అటువంటి తల్లి భ్రూణ హత్యలు, హత్యలు, చేయించిందనీ, బంగారం మటుమాయం చేసేదంటే నమ్మలేకపోయినా. అరెస్ట్ అయింది. ఋజువు చేయలేక విడుదల చేశారు. యక్షిణీ అని నిక్‌నేమ్ పెట్టారు

బంధుగులు. అనుమానించారు గానీ ఆమె చేతిలో నగవుండగా పట్టుకోలేక పోయారు. మిన్ను విరిగి మీదపడినా చలించదు. ఫ్రీలాయిష్టం. కొడుకూ, కోడలు, మనుమలు జబ్బుపడి చూచేవారు లేరని, మనిషిని పంపి తెప్పించుకున్నారు. తల్లిని సన్మార్గాన పెట్టాలని కొడుకు గుండు కొట్టించి సైను పంచె కట్టించాడు. రవిక తీసేసింది. వేలు ముడి, నగలు కలంకారీ చీరలు లేవని బాధే లేదు కామాక్షమ్మకు. కిమ్మనలేదు. గానీ లోపల ఫ్రస్ట్రేట్ అయి వుండాలి. మంచి మార్గాన పెడుతున్న స్వామికి లౌ లెటర్ వ్రాసింది. రసవిద్య వచ్చుననీ, పరిమళకార విద్య వచ్చుననీ, వశీకరణ మంత్రం వచ్చుననీ, బంగారం చేయగలననీ, తన ఫ్రెండ్సులో దొంగ బంగారం కొనే వాళ్లున్నారనీ, దొంగనోట్లు సర్క్యులేట్ చేయగలననీ, స్వామి ఆశ్రమం పైకి తేగలననీ వ్రాసింది. యెంత సాహసం యెన్ని గుండెలుండి వుండాలి!

ఇంట్లో అంతా ఆరోగ్యవంతులైనారు. కొడుక్కి ప్రమోషన్ వచ్చింది. ఛీఫ్ అయినాడు.

స్వామి ఆ వుత్తరంతో వచ్చి ఛీఫ్ కిచ్చాడు.

''నాయనా! సుదర్శనం! అమ్మను వాడుకోటమెట్లాగో నాకు తెలుసు. నేను కొని నడుపుతున్న హోటల్ నష్టం మీద నడుస్తున్నది. నా ఆశ్రమమూ గడ్డు సమస్యలెదుర్కుంటున్నది. పోటీగా మరొకరు ఆశ్రమం నడుపుతున్నారు. రాజకీయాలు జొరబడ్డాయి. అమ్మను నా వెంట పంపు. నేనామెను మానేజ్ చేస్తాను. ''స్వామి వూరడింపుగా, సానుభూతి చూపుతూ సాంత్వనంగా చెప్పాడు ఛీఫ్‌కి.

''అంత సమర్ధురాలి చేతినుండి ఆస్తి యెలా జారిపోయింది స్వామీ?'' అన్నాడు ఛీఫ్. వ్యధ, అమాయకత్వం. ప్రేమ.

'' ఆమెను మానేజ్‌చేసేవారు, అజమాయిషీచేసేవారు లేకపోవటం కారణం నాయనా. మితిమీరిన స్వేచ్ఛ పాడు చేసింది అమ్మను. సమర్థురాలూ నేర్పరీ గనకనే యింతవరకూ యెవరూ అమ్మను కటకటాల వెనకవుంచలేకపోయారు. అమ్మను నా వెంట పంపు సుదర్శనం నాయనా. నేనామెను మానేజ్ చేస్తా'' అని వూరడించారు స్వామి. విచారం పెట్టుకోకు అని అనునయించారు స్వామి.

''తీసికెళ్లండి స్వామి! యెంతైనా అమ్మ గదా''.

విదిశా కళ్లు మొహం ముక్కు రుమాలతో అద్దుకుని నవ్వుతూ చూసింది. ''యెంతగా ప్రేమించానో యెంతగా గౌరవించానో ఆ అమ్మలనిద్దరినీ దేవుని కెరుక'' అన్నది.

''ప్రపంచమే ఒక గ్రంథాలయం. దైవమే రచయిత. యెన్ని రచనలు చేశాడో. ఒక్కొక్క మనిషి ఒక్కొక్క పుస్తకం అయితే వారిని స్టడీ చేస్తే ఇంటరెస్టింగా, అద్భుతంగా రచనలు సాగినై అనుకోవాలి మనం. ఇందాకటి నించీ మీరడిగిన పుస్తకం కోసం వెతుకుతున్నా. యెవరైనా తీసికెళ్లారా అని ఆలోచిస్తూ వింటూనే వున్నా''.

'' ఒక వ్యవహారం చేతిలో పెట్టుకొచ్చి డబ్బుతో దాన్ని పరిష్కరిస్తాననేది. ఇవ్వకపోతే టెర్రరిజం వుపయోగించేది అమ్మ లేదా మరొక టెర్రరిస్టుని దాడిచేయమని తోలేది. వస్తా మేడమ్. నిజం కల్పన చేసి రచించటం కష్టమే మేడమ్'' అని పుస్తకంతో వెళ్లిపోయింది విదిశా.